క్లుప్తంగా

సాంస్కృతిక ప్రదర్శనలో ప్రతిభ



మచిలీపట్నంటౌన్: గణతంత్ర దినోత్సవం నాడు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతిభ చాటిన స్థానిక జవ్వారుపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇంగ్లిషు మీడియం హైస్కూల్ విద్యార్థినులను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధరరావు ప్రశంసించారు. కృష్ణా, గుంటూరు జిల్లా ప్రాశస్త్యాన్ని వివరిస్తూ తమ ప్రదర్శన ద్వారా కళ్లకు కట్టినట్లు నృత్య ప్రదర్శన ఇచ్చిన విద్యార్థినుల బృంద ప్రతిభను మెచ్చిన కలెక్టర్ వారికి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయినులు నాగలక్ష్మి, మహాలక్ష్మి, వసంతలక్ష్మిలను అభినందించారు. కలెక్టర్, ఎస్పీల నుంచి ప్రశంసలు పొందిన విద్యార్థినులను హెచ్‌ఎం ఎం.సత్యన్నారాయణ అభినందించారు.

కార్నియాల సేకరణ


తలశిల నీలమ్మ (ఫైల్)

నాగాయలంక: గ్రామంలోని రెండో వార్డుకు చెందిన తలశిల నీలమ్మ(86) అనారోగ్యంతో బుధవారం మరణించగా ఆమె నేత్రాలను స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ద్వారా విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. మరో ఇద్దరికి చూపునిచ్చే అవకాశం కల్పించాలనే సంకల్పంతో ఆమె సంతానం సాంబశివరావు, శివశంకర్, సబ్బినేని శివపార్వతి (కుమార్తె) ఇతర కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందు కొచ్చారు. నేత్రదాన మోటివేటర్స్‌గా సామాజిక సేవలు అందిస్తున్న సేవాసంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకటనారాయణ లను సంప్రదించి సమాచారం అందించగా వారి సహకారంతో కంటి ఆసుపత్రి ఐ టెక్నీషియన్ మహేష్ బృందం వచ్చి మృతురాలి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకెళ్లారు.

సంఘాలకు స్వయం నియంత్రణ ఉండాలి

పెడన: స్వయం సహాయక సంఘాలు, గ్రామ సమాఖ్యలు ఆర్థికంగా పరిపుష్టి సాధించి స్వయం నియంత్రణ కలిగి ఉండాలని ట్రైనీ రిసోర్స్ పర్సన్ కేవై దాసు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మండల సమాఖ్య, గ్రామ సమాఖ్యల కలల నిర్మాణ కార్యక్రమంపై 43 గ్రామ సమైఖ్య సంఘ అధ్యక్షులకు శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ట్రైనీ ఆర్పీ దాసు మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో గ్రామ సమాఖ్యలు, మండల సమాఖ్యలు ఆర్థికంగా బలోపేతం కావడానికి అనుసరించాల్సిన మార్గాలపై పట్టుసాధించాలన్నారు. తద్వారా స్వయం యాజమాన్యం, స్వయం నియంత్రణ కలిగి పరిపాలన ఖర్చులు, ఆదాయాల నుంచి వారే భరించేలా నడుచుకునేలా వృద్ధి చెందాలన్నారు. ట్రైనీ ఆర్పీ వి.శ్రీదేవి, సీసీలు కె.వెంకటేశ్వర్లు, పి. సుజాత, ఎం.తులసీబాల, వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రతిభా పాటవ పోటీలు

అవనిగడ్డ: గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక గాంధీక్షేత్రంలో గురువారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహక ప్రతినిధి కూనపరెడ్డి చంద్రశేఖరరావు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు వ్యాసరచన, పాటల పోటీలు జరుగుతాయని, విజేతలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బహుమతులు అందిస్తారు. వివరాలు కోసం 99494 17719 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన

బంటుమిల్లి: స్థానిక వాగ్దేవి జూనియర్ కాలేజీ విద్యార్థులకు పలు చట్టాలపై ఎస్‌ఐ గణేష్‌కుమార్ అవగాహన కలిగించారు. బుధవారం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ మంచిగా ఉండాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ క్రైంలు, డ్రగ్స్, రోడ్డు భద్రత, ర్యాగింగ్ తదితర చట్టాలను వివరించారు. కాలేజీ డైరెక్టరు విజయకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్ పరిశీలన

బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరం రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్డును ఆర్‌డబ్ల్యూఎస్ విజిలెన్స్ అధికారులు బుధవారం పరిశీలించారు. పథకం పరిధిలోని ఒక ఇసుక ఫిల్టర్‌ను కాంట్రాక్టర్ సక్రమంగా మరమ్మత్తులు చేయలేదంటూ అందిన ఫిర్యాదు మేరకు అధికారులు ఫిల్టరులో ఉపయోగించిన ఇసుక, కంకర నిబంధనల మేరకు ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. దీనిపై ఈఈ నటరాజు మాట్లాడుతూ తనిఖీ వివరాలు చెప్పలేమని నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. డీఈ శ్రీనివాస్, ఏఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

గూడూరు: విజయ డెయిరీ లబ్ధిదారుని కుటుంబానికి రూ.50 వేల విలువైన బీమా చెక్కును విజయ డెయిరీ జిల్లా డైరెక్టర్ ఆర్జా వెంకట నగేష్ అందజేశారు. మల్లవోలుకు చెందిన ఈడే కృష్ణకుమారి ఇటీవల మృతి చెందారు. ఆమె విజయడెయిరీకి పాలు పోస్తుండటంతో బీమా సౌకర్యం కలిగి ఉంది. ఆమె భర్త ఈడే సాంబయ్య చెక్కు అందజేశారు. పోతన స్వామినాయుడు, గోపి నాగబాబు, బత్తిన వీరబాబు, కూనపురెడ్డి పాండురంగారావు, బొర్రా శ్రీను, పూల నాగరాజు పాల్గొన్నారు.

శిథిల వంతెనతో ముప్పు

- శిథిలావస్థలో మురుగు డ్రెయిన్‌పై వంతెన
- పెచ్చులూడి బయట పడ్డ ఇనుప సువ్వలు
- వంతెన కూలితే ఆరు గ్రామాలకు ముప్పు

వెంకటాపురం(మోపిదేవి): మురుగు డ్రెయిన్‌పై వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన కూలితే ఆరు గ్రామాలకు ముప్పు వాటిల్లనుంది. పెచ్చులూడి బయట పడ్డ ఇనుప చువ్వలు, పగుళ్లతో ఏక్షణాన ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయపడిపోతున్నారు.

విషయం ఇదీ..

మండల పరిధిలోని వెంకటాపురంలో సుమారు ఆరు దశాబ్దాల(60) క్రితం మురుగు డ్రెయిన్‌పై వంతెన నిర్మించారు. ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. వంతెన గోడలు బీటలు వారాయి. వంతెన కింద భాగం సిమెంటు తొలగిపోయి ఇనుప చువ్వలు బయట పడ్డాయి. ఏ క్షణాన కూలిపోతుందోనని ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

ఈ గ్రామాలకు ఇబ్బందే..

రావివారిపాలెం, బోడగుంట, చిరువోలు, మెరకనపల్లి, వెంకటాపురం గ్రామాల నుంచి వదిలే మురుగునీరు ఈ వంతెన ద్వారా మంగళవాని సింక్‌కు చేరుతుంది. ప్రతి ఏడాది వచ్చే భారీ వర్షాలకు ఈ గ్రామాల నుంచి మురుగునీరు సముద్రంలోకి పోతుంది. ఇటీవల వచ్చిన భారీ వర్షాలకు డ్రెయినేజీ ముంపునకు గురికావడంతో ఆ పక్కనే ఉన్న వైఎస్సార్ కాలనీ కూడా పూర్తిగా మునిగిపోయింది. క్రిమికీటకాలు గృహాల్లోకి చేరడంతో ఓ విద్యార్థి కూడా పాముకాటుకు గురయ్యాడు. నిరంతరం ఈ వంతెనపై మెరకనపల్లి, టేకుపల్లి, మేళ్లమర్రు, అయోధ్య, ఉత్తరచిరువోలులంక తదితర గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు.


వెంకటాపురంలో శిథిలావస్థకు చేరిన వంతెన

ప్రాధాన్యత ఇదీ..

రైతులు పండించిన పంట ఉత్పత్తులు ఈ వంతెన ద్వారానే బయట మార్కెట్‌కు తరలించాల్సి ఉంది. ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు, కాలనీ వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ వంతెన కూలితే బయట గ్రామాలకు సంబంధాలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున వెంటనే ఈ శిథిలమైన వంతెన తొలగించి కొత్త వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రజా ప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు.


బీటలు వారిన వంతెన


వంతెన కింద బయట పడిన ఇనుప సువ్వలు



రైతులకు తీవ్ర ఇబ్బంది

శిథిలావస్థకు చేరిన వంతెన కూలితే రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. మురుగు డ్రెయిన్‌పై సమీపంలో ఎక్కడా వంతెన కూడా లేదు. రైతులు పండించిన పంటలు, ఇతరాలు పెదకళ్లేపల్లి చుట్టూ తిరిగి రావాలి. వంతెన నిర్మించి రైతులను ఆదుకోవాలి.

– అబ్బూరి నాంచారయ్య, మాజీ సర్పంచ్, వెంకటాపురం



జాగ్రత్త చర్యలు చేపట్టాలి

వంతెన నిర్మించి సుమారు 60 సంవత్సరాలకు పైగా అవుతుంది. వంతెన పక్కనున్న రెయిలింగ్స్ కూలిపోవడంతో పాటు వంతెన కింద ఇనుప చువ్వలు బయట పడ్డాయి. బరువైన వాహనాలు వంతెనపై వెళ్లితే కూలి పోయేందుకు సిద్ధంగా ఉంది. జాగ్రత్త చర్యలు చేపట్టాలి.

– గోపిశెట్టి సీతారామయ్య, రైతు, వెంకటాపురం



విష సర్పాలతో జీవిస్తున్నాం..

భారీ వర్షాలు, మురుగు నీరు కాలనీలోకి చేరడంతో విష సర్పాలు చేరుతున్నాయి. ఇటీవల భారీ వర్షాలకు కాలనీలో నీరు నిలిచిన ఘటనలో ఓ బాలికను పాము కాటు వేసింది. కొద్దిపాటి వర్షానికి పైగ్రామాల నుంచి వచ్చే మురుగు మా కాలనీ మీదగా ఈ వంతెను నుంచే బయటకు పోవాలి. సమస్య పరిష్కరించాలి.

– కొండపల్లి సుగుణ, గృహిణి, వెంకటాపురం

మధ్యాహ్న భోజనం తనిఖీ



నాగాయలంక: మండల తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్, ఎంపీడీఓ జె.సీతారామ్ కుమార్ బుధవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్.ఎం కేవీఎస్‌వీ ప్రసాదరావుతో కలిసి వంటశాలలో వండిన పదార్థాలను తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల బాలికలతో కలిసి అధికారులు ఇరువురూ భోజనం చేశారు. ఈ సందర్భంగా వంటశాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు పద్యాల రఘురామయ్య, రజని, పూర్ణచంద్రరావు వారి వెంట ఉన్నారు.

నేడు పురపాలక సంఘ సమావేశం

పెడన: పురపాలక సంఘ కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ మీటింగ్ హాలులో జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో గురువారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 11.30 గంటల నుంచి 12.30 మధ్య జరిగే ఈ కార్యక్రమానికి ప్రయాణికుల అవసరాల కోసం సూచనలు, సలహాలు అందించవచ్చన్నారు. వివరాలు కోసం 99592 25466 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించకపోతే ఎలా?

సిబ్బందిపై జెడ్పీ సీఈవో ఆగ్రహం

పెడన: రికార్డుల నిర్వహణ కూడా సక్రమంగా లేకపోతే ఎలా అంటూ మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందిపై జిల్లా పరిషత్ సీఈవో కె.కన్నమనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం పెడన ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయం పరిసర ప్రాంతాలను కూడా పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రం చేయించడమే కాదని, ఆఫీసు లుక్ రావాలని, గ్రీనరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. అప్ డేట్‌గా రికార్డులు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తీరు మార్చుకుని విధులను సక్రమంగా నిర్వహించి రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచాలని ఆదేశించారు. ఈయనతో పాటు జెడ్పీ నుంచి సీనియర్ అసిస్టెంట్ సాయిగోపాల్, జూనియర్ అసిస్టెంట్ గౌతమ్ కూడా ఉన్నారు. ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, పెడన ఇన్‌చార్జి ఎంపీడీవో జయరాం, ఏవో శిరిష, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి తదితరులు ఉన్నారు.


పెడన ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో కన్నమనాయుడు

సబ్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల సత్తా

గోగినేనిపాలెం(ఘంటసాల): 84వ గ్రిగ్ మెమోరియల్ సాఫ్ట్ బాల్ ఆటల పోటీల్లో గోగినేనిపాలెం హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 23 నుంచి 25 వరకు అవనిగడ్డ నియోజకవర్గం తలగడదీవి జెడ్పీ హైస్కూల్లో జరిగిన 84వ గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీలు నిర్వహించారు. సాఫ్ట్ బాల్ సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో మండలంలోని గోగినేనిపాలెం హైస్కూల్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు తెలిపారు. సాఫ్ట్ బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన సీనియర్స్, జూనియర్ విభాగం విద్యార్థులకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ గరికపాటి మారుతిని హైస్కూల్ అభివృద్ధి కమిటీ సభ్యులు అత్తలూరి గోపిచంద్, హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు. వచ్చే నెల 4 నుంచి 6వ తేదీ వరకు గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో జరిగే కృష్ణా జిల్లా సెంట్రల్ జోన్ ఆటల పోటీల్లో కూడా ప్రతిభచాటి విజేతలుగా నిలిచి హైస్కూలు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని హెచ్‌ఎం ఆకాంక్ష వెలిబుచ్చారు.

ఫిబ్రవరి 3న విజయ వనవలమ్మ విగ్రహ ప్రతిష్ట

రేపటి నుంచి పూజలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: నగరంలోని నిజాంపేటలో శ్రీ కల్యాణ సుందరేశ్వర సమేత శ్రీ విజయ వనవలమ్మ విగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవాన్ని ఫిబ్రవరి 3వ తేదీన ఉదయం 11.45 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ భక్తబృదం ప్రతినిధులు బుధవారం తెలిపారు. నూతన ఆలయ ప్రాంగణంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోజు సాయంత్రం అమ్మవారి శాంతి కల్యాణం కన్నుల పండువగా నిర్వహిస్తామన్నారు. ప్రతిష్టా మహోత్సవానికి తమిళనాడుకు చెందిన శ్రీ సిద్ధేశ్వరి పీఠాధిపతి కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా ఈ నెల 31వ తేదీ నుంచి ఆలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఫిబ్రవరి 1, 2 తేదీల్లో కూడా పలు పూజా కార్యక్రమాలు జరుగుతాయి. పాత ఆలయ స్థానంలోనే పూర్తిగా రాతితో ఆలయాన్ని పునఃనిర్మించామన్నారు. ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాలను రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భక్త బృందం ప్రతినిధులు మిరియాల రామకృష్ణ, శీలం బాబ్జీ, నరహరిశెట్టి కనకదుర్గావరప్రసాద్, విన్నకోట వనదేవి, పొన్నూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

కోనేరుసెంటర్: ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని జిల్లా ఇన్‌చార్జి రవాణా శాఖ అధికారి బీఎస్‌ఎస్ నాయక్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధరరావు ఆదేశాలతో బుధవారం హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ మహిళా పోలీసులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీవో అధికారులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏ.వి.శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో మచిలీపట్నం టౌన్ సర్కిల్ మహిళా పోలీసులు, శక్తి టీమ్స్, స్పెషల్ పార్టీ మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మహిళా పోలీసులు ద్విచక్ర వాహనాలు నడుపుతూ, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత, హెల్మెట్ ధారణ వల్ల ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నాయక్ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం ద్విచక్ర వాహనదారులకు అత్యంత శ్రేయస్కరమన్నారు. సివిల్, ట్రాఫిక్ ఎస్‌ఐలు ఇంచార్జ్ డీటీఓ శ్రీనివాస్ నాయక్, ఎంవీఐ సిద్దిక్ , ఏఎంవీఐ సోనీ ప్రియా తదితరులు పాల్గొన్నారు.

బూడిద తెగులు నివారించాలి

పెదప్రోలు(మోపిదేవి): మినుము పంటలో బూడిద తెగులు వ్యాప్తి చెందుతుందని మండల వ్యవసాయాధికారి కె. హెప్సిబారాణి తెలిపారు. మండలంలోని పెదప్రోలు, నాగాయతిప్ప గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మినుములో అక్కడక్కడ బూడిద తెగులు వ్యాపించినట్లు గుర్తించామని, దీని నివారణకు ఇన్‌డెక్స్ పొడరు ఎకరాకు 100 గ్రాములు 110 లీటర్ల నీటిలో కలిపి పైరుపై పిచికారీ చేయాలని, వేపనూనె ఎకరాకు 5 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మొక్క బలానికి అగ్రోమిన్ మ్యాక్స్ ఎకరాకు అరకిలో 110 లీటర్ల నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు.

జేఈఈ మెయిన్స్‌కు 280 మంది హాజరు

పెడన: జేఈఈ మెయిన్స్ పరీక్షలు మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సెంటరులో 280 మంది పరీక్షకు హాజరయ్యారని కేంద్రం అడ్మిన్ అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 140 మందికి గాను 139 మంది హాజరయ్యారని, ఒకరు అబ్సెంట్ అయ్యారన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన పరీక్షకు 142 మందికి 141 మంది హాజరవగా ఒకరు హాజరుకాలేదు. మొత్తం 282 మందికి గాను 280 మంది పరీక్షకు హాజరవగా ఇద్దరు హాజరుకాలేదని, ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని ఆయన తెలిపారు.

మినుములో పల్లాకు తెగులు నివారించాలి

కొడాలి(ఘంటసాల): మినుము పంటలో పల్లాకు తెగులు, బంగారు తీగ నివారణ చర్యలు చేపట్టాలని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల రైతులకు తెలిపారు. మండలంలోని కొడాలి, తాడేపల్లి గ్రామాల్లోని మినుము పంట పొలాలను శ్యామల, ఎంఏవో కె.మురళీ కృష్ణతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మినుము పొలాల్లో ప్రస్తుతం పల్లాకు తెగులు ఎక్కువగా కనిపిస్తుందని, పొలంలో పసుపు పచ్చని మొక్కలు కనిపించిన వెంటనే పీకేసి పిప్రోనిల్ 400 మి.లీ.లు లేదా ఎసిటామప్రిడ్ 40 మి.గ్రా.లు ఒక లీటరు నీరు చొప్పున ఏదో ఒక మందును పిచికారీ చేసుకోవాలని చెప్పారు. 45 రోజుల దాటిన మినుము పంటలో బంగారుతీగ కలుపు కనిపించిన వెంటనే 2 మి.లీ.పారాక్వాట్ మందును ఒక లీటరు నీటిలో కలిపి బంగారు తీగ ఉన్న మినుము మొక్క మాత్రమే మందు పడేలా పిచికారీ చేయాలని తద్వారా బంగారు తీగ కలుపు ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. బంగారు తీగ నివారణ మందు పక్క మొక్కలపై పడితే దెబ్బతింటాయన్నారు. కొడాలి ఉప సర్పంచ్ తుమ్మల శంకరరావు, ఏవో కె.మురళీ కృష్ణ, వీఏఏలు వెంకటలక్ష్మి, వై.ఆలీ, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా మౌని అమావాస్య పూజలు

భావదేవరపల్లి(నాగాయలంక): పుష్యమాసం మౌని అమావాస్య సమ్మిళిత పర్వదినం పురస్కరించుకుని బుధవారం స్థానిక శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో తొలుత శ్రీవినాయకస్వామికి పంచామృతాలు, పసుపు, కుంకుమ, గంధం, విభూధితో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు విశేష అభిషేకాలు నిర్వహించి, గరిక పూజ ఘనంగా జరిపారు. అనంతరం శ్రీకాశీ విశ్వేశ్వరస్వామికి, అన్నపూర్ణదేవికి అభిషేకాలు పూజ జరిపి అలంకరించారు. వినాయకుడిని గరిక గడ్డితో పవిత్రమూర్తి స్వరూపంతో తీర్చిదిద్దారు. అర్చకుడు మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులు పర్యవేక్షించారు. భావదేవరపల్లి, పరిసర గ్రామాల నుంచి భక్తులు వచ్చి స్వామి వార్ల అభిషేక పూజలు తిలకించారు.

ఉద్యోగోన్నతిపై బదిలీ అభినందనీయం

పెడన: పురపాలక సంఘ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఆవుల ధనలక్ష్మి విధులు సక్రమంగా నిర్వహించి ఉద్యోగోన్నతిపై సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ కావడం అభినందనీయమని మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. బదిలీపై వెళ్తున్న ధనలక్ష్మిని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించి సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కటకం ప్రసాద్ మాట్లాడుతూ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడమే కాకుండా తన పని తాను చేసుకుంటూ ఎవరిని నొప్పించకుండా విధుల పట్ల అంకితభావంతో పనిచేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, మట్టా రాజా, మున్సిపల్ ఉద్యోగులు, సచివాయల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న పల్లా

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బుధవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయం వెలుపల పార్టీ నాయకులు స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ స్వామి వారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని వచ్చిన అభ్యర్థనలపై సీఎం చంద్రబాబునాయుడుదృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. నడకుదుటి జనార్థనరావు, మోర్ల రాంబాబు, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

కోనేరుసెంటర్: మండల పరిధిలోని కానూరు గ్రామంలో బుధవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ ప్రారంభించారు. మండల పశు వైద్యాధికారి దీపక్ డానియల్ 50 దూడలకు నట్టల నివారణ మందు, 100 గేదెలకు డీవార్మింగ్, మరో 25 పశువులకు సాధారణ వైద్య పరీక్షలు చేశామన్నారు. ఎస్‌వీవీ రామారావు, గ్లోరీ, రంజిత, ఈశ్వరమ్మ, శ్రీనివాసరావు, గోపాలమిత్ర రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు ఖాళీ చేయించిన అధికారులు

చల్లపల్లి సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు

బోడగుంట(మోపిదేవి): కమ్యూనిటీ భవనంలో ఉంటున్న పాస్టర్ మొండితోక జాన్ శ్రీకర్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఖాళీ చేయించారు. బోడగుంట చర్చి ఏరియాలో కమ్యూనిటీ హాలు ఉంది. ఇక్కడ కొత్త చర్చి నిర్మిస్తున్నారు. కొన్నేళ్లుగా ఇది సాగుతోంది. దీంతో పాస్టర్ కుటుంబం కమ్యూనిటీ హాలులో ఉంటోంది. దీనిని ఖాళీ చేయించే విషయంలో రెండు గ్రూపులు ఏర్పడ్డాయి. అనపర్తి గుప్తా అనే వ్యక్తి లోకాయుక్తలో వేసిన కేసుతో భవనం ఖాళీ చేయించాలని జిల్లా కలెక్టర్ ఎంపీడీవోను ఆదేశించారు. నోటీసులు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో ప్రజా ప్రతినిధులు, పోలీసులు కమ్యూనిటీ హాలు ఖాళీ చేయించి తాళాలు వేశారు. చర్చ్ ప్రాంగణంలోనే ఓపక్క తాత్కాలికంగా మూడు రోజులు ఉండేందుకు అవకాశం కల్పించారు. అంతకుముందు ఎంపీడీవో జె.స్వర్ణభారతి, తహసీల్దార్ శ్రీవిద్య ఆందోళన కారులకు నచ్చచెప్పినా అంగీకరించలేదు. పాస్టర్ వర్గం, వ్యతిరేక వర్గంగా చీలి వాదోపవాదనలతో ఉద్రిక్త పరిస్థితులకు దారితీశాయి. దీంతో జెడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జునరావు, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు రెండు వర్గాలతో చర్చించి ఒప్పించారు. కమ్యూనిటీ భవనానికి తాళం వేసి గ్రామ కార్యదర్శి మల్లేశ్వరావుకు అందజేశారు. ఎస్‌ఐ సత్యనారాయణ, ఈవోపీఆర్డీ త్రిపుర సుందరి, కార్యదర్శి మల్లేశ్వరావు, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


ఆందోళన కారులతో మాట్లాడుతున్న సీఐ ఈశ్వరావు, ఎస్‌ఐ సత్యనారాయణ

దివిసీమ ఖ్యాతిని ఇనుమడింపజేసిన వేటూరి

అవనిగడ్డ: సుప్రసిద్ధ తెలుగు సినీరచయిత వేటూరు సుందరరామమూర్తి తన పాటల ద్వారా దివిసీమ ఖ్యాతిని ఇనుమడింపజేశారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక గాంధీక్షేత్రంలో బుధవారం వేటూరి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.వేటూరి చిత్రపటానికి బుద్ధప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు చిత్రసీమ ఉండంత వరకూ వేటూరి పాటలు చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. అంతటి గొప్పరచయిత మన ప్రాంతవాసి కావడం గర్వకారణమన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ క్యాలెండర్ల ఆవిష్కరణ

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నూతన సంవత్సర క్యాలెండర్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల దైవమైన వాసవీమాత త్యాగనిరతి, ఆత్మాభిమానం స్ఫూర్తిదాయకమన్నారు. వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. మహాసభ అవనిగడ్డ శాఖ అధ్యక్షుడు కొల్లిపర రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు విస్సంశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి కోడూరు పవన్‌కుమార్, నాయకులు బెజవాడ ధనసురేష్, దేను శేషగిరిరావు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌పై చీటింగ్ కేసు

కోనేరుసెంటర్: మచిలీపట్నంకు చెందిన ఓ ల్యాబ్ టెక్నీషియన్‌పై మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం చీటింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బందరుకోటకు చెందిన భట్టి దుర్గా వెంకటలీలాప్రసాద్ బందరులో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన లంకే శ్రీనివాసరావు అనే వ్యక్తితో తాను మరో కొత్త ల్యాబ్ ప్రారంభించబోతున్నానని, అందులో భాగస్వామ్యం కల్పిస్తాననినమ్మించి రూ.పది లక్షలు తీసుకున్నాడు. డబ్బు తీసుకున్న లీలాప్రసాద్ ల్యాబ్ పనులుచేపట్టకపోవటంతో అనుమానం వచ్చిన శ్రీనివాసరావు అతన్ని నిలదీశాడు. మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో అతనిపై చీటింగ్ కేసు పెట్టాడు. పోలీసులు లీలాప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. బుధవారం కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.